

విచారణలో లోపాలు ఉండొద్దు
పిల్లలపై లైంగిక వేధింపుల కేసుల విచారణలో లోపాలు ఉండొద్దని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు.
- 10లో ▸



కారులో మంటలు
నడుస్తున్న కారులోంచి మంటలు వచ్చి పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటన ఎడపల్లి మండలం అశోక్‌సాగర్ వద్ద జరిగింది.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
43.0 /29.3

వాతావరణం
ఉదయం నుంచి ఎండ ప్రకాశవంతంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సదరం క్యాంపులు ఖరారు

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లాలో జూన్ 7, 14, 21 తేదీల్లో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపులకు హాజరయ్యే దివ్యాంగులు ఈ నెల 4 నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. సదరం రసీదులో నమోదైన తేదీల్లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తగు పత్రాలతో రావాలని సూచించారు.

మీరాకుమార్‌ను కలిసిన జిల్లా నాయకులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్‌ను హైదరాబాద్‌లో శనివారం జిల్లా కాంగ్రెస్ నాయకులు కలిశారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర నాయకులు బాడ్సి శేఖర్‌గౌడ్, బాస వేణుగోపాల్ యాదవ్ కలిసిన వారిలో ఉన్నారు. రాష్ట్రంలో ప్రజాసమస్యలపై కాంగ్రెస్ చేస్తున్న పోరాటాల గురించి మహేష్‌కుమార్‌గౌడ్ మీరాకుమార్‌కు వివరించారు.

రైతు వేదికకు తాళం వేసిన సర్పంచ్

- మూడేళ్లయినా బిల్లులు రాలేదని నిరసన




నవీపేట : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎడ్ల బండ్లపై ఊరేగింపుగా వచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు రైతు వేదికలోకి వెళ్లేందుకు యత్నించగా సర్పంచ్ ద్యాగ సరిన్ అడ్డుకుని తాళం వేశారు. మూడేళ్ల కిందట రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు వేదికకు రూ.18 లక్షలే చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రూ.నాలుగు లక్షలు బిల్లులు రావాల్సి ఉందని, దీనికి నిరసనగా తాళం వేశానని పేర్కొన్నారు. అన్ని సమస్యలు పరిష్కరించాక సంబురాలు జరుపుకోవాలని చెప్పడంతో బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, వైస్ చైర్మన్ బాబర్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు సర్పంచ్‌తో వాగ్వాదానికి దిగారు. ఎంపీడీవో సాజిద్ అలీ, ఏవో సురేష్‌గౌడ్ జోక్యం చేసుకుని కలెక్టర్‌తో మాట్లాడి.. మిగతా బిల్లులు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత రైతు వేదిక తాళం తీసి లోపలికి ప్రవేశించి యథావిధిగా సంబురాలు జరుపుకున్నారు.

సాహసం శ్వాసగా..!

ఎత్తయిన పర్వతాలను ఎక్కడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. దానికి గుండె ధైర్యం కూడా కావాలి. అంతకుమించి కఠోర శ్రమ అవసరం. లక్ష్యాన్ని సాధించేందుకు కష్టాలను అధిగమిస్తున్నారు అడవిబిడ్డలు. అది కూడా చిన్న వయసులోనే పర్వతాలను ఎక్కి దేశకీర్తిని ఎవరెస్టంత ఎత్తుకు తీసుకువెళ్లిన 'పూర్ణ' నుంచి కిలిమంజారో అధిరోహించి మరిన్ని పర్వతాలు ఎక్కేందుకు సిద్ధమైన 'వెన్నెల' దాకా.. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సవాళ్లనెన్నింటినో ఎదిరించి సక్సెస్ అవుతున్నారు. – సాక్షి, కామారెడ్డి

- పర్వతాలను అధిరోహిస్తున్న అడవిబిడ్డలు
- కిలిమంజారో నుంచి ఎవరెస్టు దాకా..
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే నలుగురు..
- ప్రోత్సహిస్తే మరిన్ని విజయాలు సాధిస్తారు



ఎవరెస్ట్ శిఖరంపై మాలావత్ పూర్ణ

సండే స్పెషల్

ఏడు పర్వతాలను అధిరోహించిన 'పూర్ణ'..



సిరికొండ మండలం పాకాలకు చెందిన మాలావత్ పూర్ణ తాడ్వాయిలోని గురుకుల పాఠశాలలో చదువుతుండగా అప్పటి గురుకులాల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రోత్సాహంతో ఎవరెస్టు ఎక్కింది. 2014లో ఆమె ఏడో తరగతి చదువుతోంది. వయసు 14 ఏళ్లు మాత్రమే. ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించిన ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలుగా చరిత్ర సృష్టించింది. తర్వాత ఆఫ్రికాలోని మౌంట్ కిలిమంజారో, ఆ తర్వాత యూరప్‌లోని మౌంట్ ఎల్‌బ్రస్, దక్షిణ అమెరికాలోని మౌంట్ అకోన్‌కగువా, ఓషియానియాలోని మౌంట్ కార్‌స్టెన్జ్, అంటార్కిటికాలోని మౌంట్ విన్‌సన్, ఉత్తర అమెరికాలోని మౌంట్ డెనాలి పర్వతాలను అధిరోహిలచింది. ఏడు పర్వతాలను అధిరోహించిన దక్షిణ భారతదేశానికి చెందిన తొలి యువతిగా కూడా పూర్ణ రికార్డు సాధించింది. ప్రస్తుతం పూర్ణ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతోంది.

ఏడు పర్వతాలు ఎక్కుతానంటున్న 'వెన్నెల'..



మాచారెడ్డి మండలం సోమారంపేట తండాకు చెందిన బానోత్ వెన్నెలది పేద కుటుంబం. పర్వతారోహణ మీద ఆసక్తితో ఎన్నో కష్టాలు ఎదుర్కొంది. చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితుల్లో మట్టిని రక్షించుకుందామంటూ వేల కిలోమీటర్ల సైకిల్‌యాత్ర చేపట్టింది. రైతులకు అవగాహన కల్పించింది. రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ సహకారంతో కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించింది. ఎల్‌బ్రస్ పర్వతాన్ని ఎక్కేందుకు రెడీ అవుతోంది. ఇంటర్ చదువుతున్న వెన్నెల ఏడు పర్వతాలు ఎక్కాలన్న లక్ష్యంతో ప్రయత్నాలు చేస్తోంది. కచ్చితంగా అధిరోహిస్తానని చెబుతోంది.

పేదరికంతో ఎల్‌బ్రస్ ఎక్కలేకపోయిన 'బన్నీ'..



రాజంపేట మండలం ఎల్లాపూర్ తండాకు చెందిన బన్నీ కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాడు. అయితే ఎల్‌బ్రస్ పర్వతం ఎక్కడానికి అవకాశం వచ్చినా స్పాన్సర్స్ దొరకకపోవడంతో అవకాశం కోల్పోయాడు. ఇటీవల ఇంటర్ పూర్తిచేసిన బన్నీ ఎలాగైనా ఎవరెస్టు ఎక్కాలన్న లక్ష్యంతో అన్ని ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ సారి కచ్చితంగా ఎల్‌బ్రస్ పర్వతం ఎక్కాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. అందుకు శిక్షణ కూడా తీసుకున్నాడు. పేదరికం ఇబ్బందికరంగా మారింది. ఎవరైనా దాతలు చేయూతనందిస్తే ఎల్‌బ్రస్ కూడా ఎక్కేస్తానని, తర్వాత మిగతా పర్వతాలన్నింటినీ అధిరోహించడమే తన లక్ష్యమని చెబుతున్నాడు.

కిలిమంజారో పర్వతాన్ని ఎక్కిన 'రజిత'..



లింగంపేట మండలంలో మారుమూలన ఉన్న సంగ్యానాయక్ తండాకు చెందిన మాలోత్ రజిత పర్వతారోహణలతో రికార్డు సృష్టించిన పూర్ణను చూసి తను కూడా ఆమె అంత ఎత్తుకు ఎదగాలని నిర్ణయించుకుంది. డిగ్రీ చదువుతు న్నప్పుడు తన లక్ష్యాన్ని సాధించేందుకు కఠోర శిక్షణ తీసుకుంది. కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించింది. ఏడు పర్వతాలు అధిరోహించాలని తపన ఉన్నా ఆర్థిక పరిస్థితులు అడ్డుగో డగా నిలిచాయి. డిగ్రీ పూర్తి చేసిన రజిత ఇప్పు డు బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈ డీ) రెండో సంవత్సరం చదువుతోంది. మంచి క్రీడాకారిణి కూడా అయిన రజిత వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించి విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దుతానని చెబుతోంది.





రాజకీయనేతలకే సలహాలు

- ప్రతిపక్ష నాయకుడి మాదిరిగా డిమాండ్లు చేస్తున్న వైస్‌చాన్స్‌లర్
- తెయూ అభివృద్ధికి నిధులు తీసుకు రావాలంటూ మంత్రి, ఆర్టీసీ చైర్మన్లకు డిమాండ్
- మరోవైపు ఉన్నతవిద్యా కమిషనర్‌పై ఘాటు విమర్శలు
- పాలకమండలి సమావేశాలు నిర్వహించడానికి వీల్లేదంటూ హుకుం జారీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ యూనివర్సిటీ పరువును బజారు పాలుచేసేలా గత రెండేళ్లుగా వ్యవహారాలు కొనసాగుతున్నాయి. వైస్ చాన్స్‌లర్ రవీందర్‌గుప్తా, ప్రొఫెసర్ కనకయ్య చేసిన అక్రమ నియామకాలు, విచ్చలవిడి నిధుల దుర్వినియోగం, ఖజానా ఖాళీ చేసిన వైనం, పీహెచ్‌డీ ప్రవేశాల్లో అవకతవకలు తదితర అంశాలు గందరగోళం సృష్టించాయి. వర్సిటీకి అత్యున్నతమైన పాలకమండలిని బేఖాతరు చేస్తూ వైస్ చాన్స్‌లర్ ఇష్టారీతిన కొనసాగిస్తున్న కార్యకలాపాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. పాలకమండలి సమావేశాలకు గైర్హాజరవుతున్న వీసీ.. అసలు ఈసీ సభ్యులు పాలకమండలి సమావేశాలు జరపడానికి వీల్లేదంటూ వారికి లేఖలు పంపడం గమనార్హం. అలాగే పాలకమండలితో సంబంధం లేకుండానే కనకయ్యను రిజిస్ట్రార్‌గా కూర్చోబెట్టేందుకు వీసీ విశ్వప్రయత్నాలు చేస్తుండడం విస్మయం కలిగిస్తోంది. మరోవైపు ఉన్నతవిద్యా కమిషనర్ నవీన్ మిట్టల్‌పై తీవ్రమైన విమర్శలు చేసిన వీసీ రవీందర్ గుప్తా తాజాగా జిల్లా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లు వర్సిటీ అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్లు నిధులు తీసుకురావాలని బహిరంగంగా డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో జెండా ఎగురవేసిన అనంతరం ప్రసంగించిన వీసీ వేదిక మీద నుంచే మంత్రి, ఎమ్మెల్యేకు నిధులు తీసుకురావాలని చెప్పడం విశేషం. గతంలోనూ రెండుసార్లు మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గోవర్ధన్ వర్సిటీ అభివృద్ధి గురించి పట్టించుకోవడంలేదని విమర్శించారు. దీంతో ప్రతిపక్ష రాజకీయ పార్టీ నాయకుడి మాదిరిగా వీసీ రవీందర్ వ్యవహరిస్తున్నారని వర్సిటీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. మరోవైపు పాలకమండలి అనుమతి లేకుండా వరుసగా ఐదుసార్లు రిజిస్ట్రార్లను మార్చిన వీసీ, పాలకమండలితో సంబంధం లేకుండానే విచ్చలవిడిగా ఖర్చులు చేశారు. ఖజానా ఖాళీ చేశారు. పైగా అసలు పాలకమండలి సమావేశాలు నిర్వహించేందుకు వీలు లేదని వీసీ హుకుం జారీ చేస్తుండడం విచిత్రం.

పాలకమండలి సభ్యులను, ఉన్నతవిద్యా కమిషనర్‌ను ఏ మాత్రం ఖాతరు చేయకుండా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్న వీసీ రవీందర్‌గుప్తా తాజాగా జిల్లా మంత్రి, ఆర్టీసీ చైర్మన్‌లు వర్సిటీ అభివద్ధి విషయంలో నిధులు తీసుకురావాలని డిమాండ్లు చేస్తుండడం గమనార్హం. మొత్తానికి వీసీ గల్లీ రాజకీయ నాయకుడి మాదిరిగా వ్యవహరిస్తుండడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ స్పందించకపోవడం గమనించదగ్గ విషయం. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ కవితకు సైతం వీసీ ఆగడాలపై విద్యార్థి సంఘాల నాయకులు పలుసార్లు ఫిర్యాదులు చేశారు. అయినప్పటికీ వర్సిటీలో గందరగోళ పరిస్థితులను చక్కదిద్దే విషయంలో ఏ ఒక్కరూ చొరవ తీసుకోకపోతుండడం మరో విశేషం. ప్రభుత్వం సైతం అంతా తెలిసినప్పటికీ మీనమేషాలు లెక్కబెడుతుండడంపై విద్యాభిమానులను విస్మయానికి గురిచేస్తోంది.

పంటకాలాన్ని ముందుకు జరుపుకోవాలి



జలాల్‌పూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

- ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

రుద్రూర్ : అకాల వర్షాలు, వడగండ్ల వాన వైపరీత్యాల నుంచి తప్పించుకోవడానికి పంట కాలాన్ని ముందుకు జరుపుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించా రు. మోస్రాలోని రైతు వేదికలో నిర్వహించి న రైతు దినోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ముందుగా వరి పంట వేసే నియోజకవర్గాల్లో బాన్సువాడ ఉందన్నారు. మరో 15 రోజులు పంట కా లాన్ని ముందుకు జరుపుకోవాలని సూచించారు. వానాకాలంలో తొందరగా పంట వేస్తే యాసంగిలో నవంబర్‌లో నార్లు పోసుకోవచ్చన్నారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఇతర పంటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. ఆయిల్ పామ్ సాగు, కూరగాయలు తదితర పంటలు వేసుకోవాలని సూచించారు. ఎంపీపీ పిట్ల ఉమ, జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, రైతు బంధు మండల కన్వీనర్ పిట్ల శ్రీరాములు, బాన్సువాడ సెగ్మెంట్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, ఏఈవో ప్రశాంత్ పాల్గొన్నారు.

కాలాన్ని బట్టి పంటలు వేసుకోవాలి

వర్ని : వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కాలా న్ని బట్టి పంటలు వేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. శనివారం మండలంలోని జలాల్‌పూర్‌లో రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. ఎంపీపీ మేక శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ హరిదాసు, ఎంపీడీవో బషీరుద్దీన్, తహసీల్దార్ విఠల్ పాల్గొన్నారు.



వన్నెల్(బి)లో రైతు దినోత్సవంలో నాగాలితో మంత్రి ప్రశాంత్‌రెడ్డి

సాగులో దేశానికి ఆదర్శం తెలంగాణ

రైతు దినోత్సవంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ : పంటల సాగులో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా శనివారం బాల్కొండ మండలం వన్నెల్(బి) రైతు వేదిక వద్ద నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు సంక్షేమ పథకాలతో సాగులో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతు బంధు, రైతు బీమా పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. కాళేశ్వరం నీళ్లను శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు తీసుకువచ్చేలా రివర్స్ పంపింగ్‌తో ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పూర్తి చేశామన్నారు. అంతకుముందు నిర్వహించిన ఎడ్ల బండ్ల ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. డాక్టర్ మధుశేఖర్, కోటాపాటి నరసింహ నాయుడు, బద్దం ప్రవీణ్‌రెడ్డి, సర్పంచ్ నాగులపల్లి భూదేవి, ఉపసర్పంచ్ కిషన్, రాజేశ్వర్, సురాజ్‌రెడ్డి, డీఏవో తిరుమల ప్రసాద్ పాల్గొన్నారు.

- బీజేపీ జాతీయ కార్యదర్శి మురళీధర్‌రావు
- ఘనంగా గోదావరి మహా హారతి



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి మురళీధర్‌రావు

గోదావరిని పరిరక్షించాలి

రెంజల్: జల వనరులతోనే మానవ మనుగడ సాగుతుందని, నదులను కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని బీజేపీ జాతీయ కార్యదర్శి, గోదావరి మహా హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్ మురళీధర్‌రావు అన్నారు. శనివారం కందకుర్తి పుష్కర క్షేత్రంలో గోదావరి మహా హారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. గోదావరిని పరిరక్షించాలన్నారు. రాష్ట్రంలో గోదావరి ప్రవేశమైన కందకుర్తి నుంచి హారతి యాత్ర ప్రారంభిస్తున్నట్లు వివరించారు.

గోవులను రాయితీపై అందించాలి

ప్రభుత్వం ఆవులను రాయితీపై అందించాలని మురళీధర్ రావు డిమాండ్ చేశారు. ప్రతీ గ్రామంలో గోశాల నిర్మాణం చేపట్టాలన్నారు. పంట పొలాల్లో రసాయన ఎరువులను వినియోగించడంతో అవి తిరిగి నదిలో చేరి నీరు కలుషితం అవుతుందన్నారు. గోదావరి మహా హారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర గోపాల్, జిల్లా అధ్యక్షుడు తిరుపతి, పిట్ల కృష్ణ మహారాజ్, మంగి రాములు మహారాజ్, ఎంపీపీ లోలపు రజని, జెడ్పీటీసీ విజయ పాల్గొన్నారు.



కందకుర్తిలో గోదావరికి హారతి ఇస్తున్న పురోహితులు చిత్రంలో బీజేపీ జాతీయ కార్యదర్శి మురళీధర్‌రావు

పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలి

నిజామాబాద్ సిటీ : గోదావరి తీరంలో గల తీర్థాలకు ఉన్న విశిష్టత, చరిత్ర, ప్రాముఖ్యత గురించి ప్రచారం చేయాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వానిదేనని మురళీధర్ రావు అన్నారు. నది తీరాన గల తీర్థాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం నిజామాబాద్ శివారులోని మాధవనగర్ బీఎల్‌ఎన్ గార్డెన్‌లో మహా హారతి ఉత్సవ సమితి ప్రముఖులతో ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో ఇందూరు జిల్లా చరిత్ర, సంస్కృతి అంశంపై సమావేశం జరిగింది. మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ నరహరి మాట్లాడుతూ మన సంప్రాదాయాలకు మూలం నదులని, మధ్యప్రదేశ్ అభివృద్ధికి మూలం నర్మదా నది అన్నారు. మరో అతిథి మాధవిలత మాట్లాడుతూ భారతీయ హైందవ సంస్కృతులను కాపాడేందుకు సంప్రాదాయలను పాటించాలన్నారు. సమావేశంలో కందకుర్తి ఆనంద్, గిరిధర్, ప్రజ్ఞాభారతి కన్వీనర్ ధారా చంద్రశేఖర్, గోదావరి హారతి సమితి అధ్యక్షుడు రచ్చ తిరుపతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివరాలను పక్కాగా నమోదు చేయాలి

ఎల్లారెడ్డి: ఎఫ్‌ఐఆర్‌తో పాటు చార్జిషీట్‌లో అన్ని వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఎల్లారెడ్డి మున్సిఫ్‌ కోర్టు పీపీ వీరయ్య అన్నారు. పట్టణంలోని మున్సిఫ్‌ కోర్టులో శనివారం ఆయన పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎఫ్‌ఐఆర్‌ నుంచి చార్జిషీట్‌ వరకు జరుగుతున్న లోపాల గురించి వారికి వివరించారు. నేరస్తులకు శిక్షలు పడేలా అన్ని ఆధారాలను సేకరించాలన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి ఎస్సైలు ఉన్నారు.

తెయూ సమస్యను పరిష్కరించాలి

- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి పీడీఎస్‌యూ నేతల వినతి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలకు పూనుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు వారు శనివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, ఆజాద్‌, జాతీయ యూనివర్సిటీల కన్వీనర్‌ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. తెయూలో గత కొన్ని నెలల నుంచి జరుగుతున్న వివాదాల కారణంగా పరిపాలన పూర్తిస్థాయిలో స్తంభించిపోయిందన్నారు. అర్హత కలిగి, నిజాయితీగా పనిచేసే వారినే తెయూ రిజిస్ట్రార్‌గా నియమించాలని డిమాండ్‌ చేశారు. అక్రమంగా జరిగిన ఆర్థిక లావాదేవీలను రద్దుచేసి, నిధులను రికవరీ చేయాలన్నారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందిస్తూ.. వారం రోజుల్లో తెయూ వివాదం పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిజామాబాద్‌ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌, ప్రధాన కార్యదర్శి కర్క గణేష్‌, ఉపాధ్యక్షుడు ఎస్‌కే అఫూర్‌, అనిల్‌ పాల్గొన్నారు.

నాసా సదస్సులో కామారెడ్డి వాసి



కామారెడ్డి అర్బన్‌: అమెరికా నేషనల్‌ ఏరోనాటిక్స్‌ స్పేస్‌ అడ్మినిస్ట్రేషన్‌(నాసా) గత నెల 24 నుంచి 28 వరకు ఐదురోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో కామారెడ్డి పట్టణం దేవునిపల్లికి చెందిన కాసర్ల మధునివాస్‌ పాల్గొని తన ప్రాజెక్ట్‌ విశ్వంతరిక్షిని ప్రదర్శించారు. దేవునిపల్లికి చెందిన కాసర్ల మధుసూదన్‌–అనుసూయల కొడుకు మధునివాస్‌ కొంపల్లిలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. 'అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి అంశం'పై పాఠశాల, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన టాలెంట్‌ టెస్ట్‌లో మధునివాస్‌ ఉత్తీర్ణత సాధించి నాసా సదస్సుకు అర్హత పొందారు. మధునివాస్‌ చిన్న వయస్సులోనే అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తికనబర్చడం ఆనందం కల్గిస్తుందని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మధునివాస్‌ హైదరాబాద్‌ వస్తున్నట్లు తండ్రి మధుసూదన్‌ తెలిపారు.

రైతును రాజు చేయడమే కేసీఆర్‌ లక్ష్యం

- కాళేశ్వరంతో తీరనున్న సాగునీటి కష్టాలు
- పద్మాజీవాడి రైతు దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

సాక్షి, కామారెడ్డి/సదాశివనగర్‌: రైతును రాజు చేయడమే సీఎం కేసీఆర్‌ లక్ష్యమని ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవిత అన్నారు. పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బంది పడకూడదనే సీఎం కేసీఆర్‌ రైతుబంధు తీసుకువచ్చారని, ఏదైనా పరిస్థితుల్లో రైతు చనిపోతే కుటుంబం అనాథ కావద్దని రైతుబీమా అమలు చేశారని, సాగునీటి కష్టాలు తీర్చడానికే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. సదాశివనగర్‌ మండలం పద్మాజీవాడి రైతు వేదిక ఆవరణలో రైతు దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సభకు కవిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే జాజాల సురేందర్‌, జెడ్పీ చైర్‌పర్సన్‌ దఫేదార్‌ శోభ, కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్‌ ముజీబొద్దీన్‌ పాల్గొన్నారు. కవిత ఎడ్లబండిపై ఎక్కి రైతువేదిక వద్దకు చేరుకున్నారు. రైతు వేదికను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ మాట్లాడారు. తెలంగాణ సమాజం ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకొని.. తొమ్మిదేళ్లు గడిచి పదో ఏటా అడుగుపెడుతున్న సందర్భంలో సింహావలోకనం చేసుకోవాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్‌ దశాబ్ది ఉత్సవాలను 22రోజుల పాటు నిర్వహించాలని ఆదేశించారని తెలిపారు. కేసీఆర్‌ తండ్రిలా రైతులకు అడగకుండానే ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు.



రైతులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, స్పీకర్‌ పోచారం

22వ ప్యాకేజీకి రూ. 850 కోట్లు విడుదల

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన 22వ ప్యాకేజీకి సంబంధించి పది రోజుల కిందటే రూ. 850 కోట్లు విడుదలయ్యాయని, త్వరలోనే పనులు చేపట్టి రైతులకు సాగునీరందించేందుకు కృషి జరుగుతుందని కవిత పేర్కొన్నారు. 24 గంటల పాటు ఉచితంగా కరెంటు ఇస్తున్నామన్నారు.

లాభదాయక పంటలు సాగు చేయాలి

రైతులు వరి, మక్క పంటలే కాకుండా లాభదాయక పంటలను సాగు చేయాలని కవిత సూచించారు. ఆయిల్‌పామ్‌కు మంచి డిమాండ్‌ ఉందని, విదేశాల నుంచి లక్ష టన్నుల దిగుమతి చేసుకుంటున్నామని పేర్కొన్నారు. రైతులు అలాంటి లాభదాయక పంటల సాగువైపు ఆలోచించాలన్నారు.



వన్నెల్‌(బి)లో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవ కార్యక్రమానికి ఎడ్లబండిపై వస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి.. వృద్ధ రైతుతో మాట్లాడుతున్న మంత్రి

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

కామారెడ్డి రూరల్‌: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు డీఈవో రాజు అన్నారు. కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి(కె)లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జయశంకర్‌ బడిబాట కార్యక్రమంలో భాగంగా స్పెషల్‌ ఎన్‌రోల్‌మెంట్‌ డ్రైవ్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ సదుపాయాలను విద్యార్థులు, తల్లిదండ్రులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేర విచారణలో లోపాలు ఉండొద్దు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: పిల్లలపై జరిగిన లైంగిక వేధింపులు, దాడుల కేసులలో నేర విచారణ ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని, లోపాలు ఉండకూడదని నిజామాబాద్‌ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. జిల్లాకోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో శనివారం డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. పిల్లల వయసు, మానసిక పరిస్థితి, సామాజిక స్థితిని పరిగణలోకి తీసుకుని వారి స్టేట్‌ మెంట్‌ను మహిళ విచారణ అధికారులు రికార్డు చేయాలని సూచించారు. నేర స్థలాన్ని పరిశీలించే సందర్భంలో నేరం జరిగిన తీరు, స్థలం, సమయం ఒక క్రమ పద్ధతిలో నమోదు చేసుకోవాలని ఆమె వివరించారు. పిల్లల స్టేట్‌మెంటుతో పాటు వారి తల్లిదండ్రులు, ప్రత్యక్ష సాక్షుల స్టేట్‌మెంట్స్‌ కీలకమని, స్టేట్‌మెంట్స్‌ను చాలా జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఫిర్యాదు స్వీకరణ నుంచి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసే వరకు అనుసరించాల్సిన విధివిధానాలు తెలిపారు. అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ మాట్లాడుతూ.. పిల్లల వాంగ్మూలాలు వారి భాషలోనే నమోదు చేయాలని అన్నారు. నేర విచారణ పోలీసు అధికారులు తమ స్వొంత భాషను పిల్లలపై ప్రయోగించరాదని తెలిపారు. సదస్సులో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి, జూనియర్‌ సివిల్‌ జడ్జిలు కుష్బు, గోపికష్ణ, డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ లక్ష్మీ నర్సయ్య, అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ మహ్మద్‌ రహిమోద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

నడుస్తున్న కారులోంచి మంటలు

అగ్నికి ఆహుతైన కారు..



ఎడపల్లి (బోధన్‌): నడుస్తున్న కారులోంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమైంది. నిజామాబాద్‌ జిల్లా జానకంపేట వైపు నుంచి నిజామాబాద్‌ వైపుకు వెళ్తున్న కారు అశోక్‌ సాగర్‌ పార్క్‌ సమీపం వద్దకు రాగానే ఇంజన్‌ నుంచి పొగలు వెలువడ్డాయి. గమనించిన రోడ్డుపై వెళ్లే వాహన చోదకులు, వర్తక సముదాయాల ప్రజలు కార్‌ డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. డ్రైవర్‌ వెంటనే కారును నిలిపివేయడంతో కారులో ఉన్న వారు దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. మంటలుగా క్రమంగా వ్యాపించి కారును పూర్తిగా దగ్ధం చేశాయి. కాగా కారులో ప్రయాణిస్తున్న వారి వివరాలు తెలియరాలేదు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా కారు ఇంజన్‌ హీటెక్కి మంటలు చెలరేగి ఉంటాయని స్థానికులు భావిస్తున్నారు.

120 వడ్ల రకాలు ప్రదర్శన



వివిధ రకాల వడ్ల గింజలు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): రైతు దినోత్సవం సందర్భంగా డొంకేశ్వర్‌ మండలం నూత్‌పల్లి రైతు వేదిక వద్ద శనివారం 120 రకాల వడ్లను ప్రదర్శించారు. జక్రాన్‌పల్లి మండలం చింతలూరుకు చెందిన ఆదర్శ రైతు నాగుల చిన్న గంగారాం (చిన్ని కృష్ణుడు) వీటిని తీసుకొచ్చారు. 15 రకాల బియ్యం గింజలు, నాలుగు రకాల కందులు, ఆరు రకాల చిరుధాన్యాలను కూడా ప్రదర్శనలో ఉంచారు. రైతులు వీటిని ఆసక్తిగా తిలకించారు. ప్రత్యేక వరి విత్తనాలు, సాగు పద్ధతులను చిన్ని కృష్ణుడు రైతులకు వివరించారు. వడ్ల గింజలతో తయారు చేసిన హారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వైభవంగా గోదావరికి మహా హారతి



కందకుర్తి ఘాట్‌ వద్ద గోదావరికి హారతి ఇస్తున్న మహిళలు



గోదావరికి హారతి ఇస్తున్న మురళీధర్‌రావు, మంగి రాములు మహారాజు, పిట్ల మహారాజ్‌



బైక్‌ ర్యాలీలో పాల్గొన్న మురళీధర్‌రావ్‌

కందకుర్తి పుష్కర క్షేత్రంలో శనివారం బీజేపీ జాతీయ కార్యదర్శి, గోదావరి మహా హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్‌ మురళీధర్‌రావు ఆధ్వర్యంలో గోదావరి మహా హారతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, స్వాములు యజ్ఞాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలు కోలాటాలు, యువకులు బైక్‌ ర్యాలీలు నిర్వహించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌/రెంజల్‌



కందకుర్తి ఘాట్‌ వద్ద యజ్ఞం నిర్వహిస్తున్న స్వాములు, పాల్గొన్న భక్తులు



సాటాపూర్‌ చౌరస్తాలో కోలాటం ఆడుతున్న మహిళలు



గోదావరికి హారతి ఇస్తున్న పురోహితులు

క్రైం కార్నర్‌

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో పలువురు మృత్యువాత చెందారు. మద్నూర్‌ మండలంలో ఒకరు నీటి గుంతలో పడి ఒకరు మృతిచెందగా, దోమకొండలో రైతు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. అలాగే డిచ్‌పల్లి మండలంలో ఓ వ్యక్తి బైక్‌ అదుపుతప్పి మృతిచెందాడు. ఎల్లారెడ్డి మండలంలో సంగారెడ్డి జిల్లావాసి బైక్‌పై వెళుతుండగా ఫిట్స్‌ రావడంతో కిందపడి మృతిచెందాడు.



వికాస్‌ మృతదేహం

మద్నూర్‌(జుక్కల్‌): ఈత నేర్చుకోవడానికి నీటి గుంతలోకి దిగిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందిన ఘటన మండలంలోని సుల్తాన్‌పేట్‌ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని శేఖాపూర్‌కు చెందిన బాత్రే చందర్‌ కుమారుడు బాత్రే వికాస్‌(22)కు ఈత రాదు. ఈక్రమంలో వికాస్‌, అతడి స్నేహితులు శుక్రవారం సుల్తాన్‌పేట్‌ శివారులోని నీటి గుంతల్లో ఈత కొట్టడానికి వెళ్లారు. జాతీయ రహదారి 161 పనుల్లో భాగంగా మొరం కోసం దిలీప్‌ బిల్డర్‌ కంపెనీ సుల్తాన్‌పేట్‌ శివారులో గుంతలు తవ్వారు. గుంతలు మిషన్‌ భగీరథ లీకేజీ నీటితో నిండిపోయింది. దీంతో నీటి గుంతలో ఈత కొట్టడానికి వికాస్‌, అతడి స్నేహితులు వెళ్లారు. వికాస్‌ తిరిగి ఇంటికి రాకపోవడంతో అతడి కుటుంబసభ్యులు శనివారం సుల్తాన్‌పేట్‌ శివారులోని నీటి గుంత వద్దకు వెళ్లారు. అక్కడ వికాస్‌ బట్టలు, చెప్పులు కనిపించడంతో నీటిలో వెతకగా వికాస్‌ మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో రైతు..

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన సాయబుగారి మల్లయ్య(65) అనే రైతు శుక్రవారం రాత్రి వ్యవసాయబావి వద్ద అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్‌ఐ సుధాకర్‌ తెలిపిన వివరాలు ఇలా.. ఉదయం పొలం వద్దకు వెళ్లిన మల్లయ్య రాత్రి వరకు ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లిచూడగా అనుమానాస్పదస్థితిలో మృతిచెంది ఉన్నాడు. వారు పోలీసులకు సమాచారం అందించగా శనివారం ఉదయం డాగ్‌స్వాడ్‌తో పాటు క్లూస్‌టీం సభ్యులు పరిసరాలను పరిశీలించారు. ఘటన స్థలాన్ని భిక్కనూరు సీఐ తిరుపతయ్య సందర్శించి మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా తమ పక్కనున్న వ్యవసాయభూమి వారిపై అనుమానం ఉందని కుటుంసభ్యులు పోలీసులకు తెలిపారు. మృతుడి కుమారుడు సాయబుగారి నర్సింలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ అదుపుతప్పి ఒకరు..



డిచ్‌పల్లి: మండలంలోని వెస్లీ నగర్‌ తండా శివారులోగల 44వ నెంబరు జాతీయ రహదారిపై ఓ వ్యక్తి బైక్‌ అదుపు తప్పడంతో కిందపడి మృతి చెందాడు. ఎస్సై గణేష్‌ తెలిపిన వివరాలు ఇలా.. సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌ గ్రామానికి చెందిన బాలయ్య (50) శనివారం మధ్యాహ్నం బైక్‌పై డిచ్‌పల్లి వైపు నుంచి ఆర్మూర్‌ వైపునకు బయలుదేరాడు. వెస్లీనగర్‌ తండా వద్ద అతడి బైక్‌ అదుపుతప్పి రహదారి కిందకు పల్టీ కొట్టింది. దీంతో తీవ్రగాయలై అక్కడికక్కడే మృతిచెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

ఫిట్స్‌ వచ్చి, బైక్‌ పైనుంచి పడి ఒకరు..

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): మండలంలోని జంగమాయిపల్లి గ్రామ శివారులో ఫిట్స్‌ వచ్చి బైక్‌పై నుంచి పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై గణేష్‌ శనివారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్‌ మండలంలోని నాగ్‌ధర్‌ గ్రామానికి చెందిన సాకలి సాయిలు(30) శనివారం మండలంలోని రుద్రారం గ్రామంలో శుభకార్యానికి వచ్చాడు. తిరిగి సొంతూరుకు వెళ్తుండగా ఫిట్స్‌ రావడంతో బైక్‌ పైనుంచి కిందపడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో ఘటన స్థలంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

రామారెడ్డి: జీవితంపై విరక్తి చెంది రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మహిళ శనివారం రామారెడ్డి పటేల్‌ చెరువులో శవమై తేలింది. రామారెడ్డి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రామారెడ్డి గ్రామానికి చెందిన బండి చిన్న లింగం, లక్ష్మీ(47) దంపతులకు ఒక కొడుకు, కుమార్తె ఉన్నారు. కొడుకు గత సంవత్సరంలో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కూతురు భర్త నుంచి విడాకులు తీసుకొని, ఇంటి వద్దే ఉంటోంది. ఈక్రమంలో ఇంట్లో తరచు గొడవలు జరుగుతుండటంతో జీవితంపై విరక్తి చెందిన లక్ష్మీ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. శనివారం చెరువులో శవమై తేలింది. భర్త బండి చిన్న లింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామారెడ్డి: మండలంలోని జగదాంబ తండాలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మహిళ తీవ్రంగా గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. రామారెడ్డి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. తండాకు చెందిన భుక్యామని(51) శుక్రవారం రోడ్డు పక్కన గాయాలతో పడిఉంది. రామారెడ్డి నుంచి అన్నారం గ్రామం వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. దీంతో స్థానికులు ఆమెను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సుభాషిణీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి..

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): బైక్‌ పైనుంచి పడి ఓ వ్యక్తి గాయపడగా, ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్సై రాజేష్‌ తెలిపిన వివరాలు ఇలా.. తాడ్వాయి మండలంలోని కన్కల్‌ గ్రామానికి చెందిన సాయిరెడ్డి (40) శుక్రవారం బైక్‌పై తిర్మన్‌పల్లి గ్రామానికి బయలుదేరాడు. మండల కేంద్రంలోని పాత చెరువు కట్టపై అతడు బైక్‌ పైనుంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రభాకర్‌రావు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ డివిజన్‌ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్‌ కాపర్‌ వైర్‌ చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఏసీపీ ప్రభాకర్‌రావు తెలిపారు. ఆర్మూర్‌ సబ్‌ డివిజన్‌ అధికారి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆర్మూర్‌ మండలం గోవింద్‌పేట్‌కు చెందిన బర్ల పోశెట్టి, జక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఉప్పు సుధాకర్‌, మామిడిపల్లికి చెందిన వరికొప్పుల శ్రీనివాస్‌, నిజామాబాద్‌కు చెందిన జిలకర ప్రసాద్‌లు ముఠాగా ఏర్పడి మారుతి ఆల్టో కారులో ఆర్మూర్‌, బాల్కొండ, జాక్రన్‌పల్లి, మాక్లూర్‌, వేల్పూర్‌, నందిపేట్‌ గ్రామాలలో గత కొన్ని రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌ వైర్ల చోరీకి పాల్పడ్డారు. పోలీసులు దర్యాప్తు చేపట్టగా బర్లపోశెట్టి, ఉప్పు సుధాకర్‌లను గోవింద్‌ శివారులో శనివారం ఉదయం అరెస్టు చేశారు. కాగ అందులో జిలకర ప్రసాద్‌ గంజాయి కేసులో ఇదివరకే జైలు పాలయ్యాడు. వరికోప్పల శ్రీనివాస్‌ పరారీలో ఉన్నాడు. కాగ నిందితుల వద్ద నుంచి రూ. మూడు లక్షల విలువ గల కాపర్‌ వైరు, ఆల్టోకారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల పట్టుకోవడంతో చాకచాక్యంగా వ్యవహరించిన ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబును, ఎస్సై రాములును, ఏఎస్సై గఫర్‌ను, కానిస్టేబులు తిరుపతి ప్రసాద్‌లకు ఏసీపీ రివార్డులు అందజేసి అభినందించారు.

టిప్పర్‌ ఢీకొని ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలు

బోధన్‌టౌన్‌(బోధన్‌): విధులు ముగించుకొని బైక్‌పై వెళుతున్న ఆర్టీసీ డ్రైవర్‌ను ఎదురుగా వచ్చిన టిప్పర్‌ ఢీకొనడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బోధన్‌ మండలంలోని సాలంసాడ్‌ గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు బోధన్‌ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం విధులు ముగించుకొని బైక్‌పై అతడు పెంటఖుర్దు మీదుగా సాంపాడ్‌ వెళుతుండగా, చెక్కిక్యాంప్‌ రోడ్డులో ఎదురుగా వస్తున్న టిప్పర్‌ ఢీకొంది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించారు. తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.